# నాన్నకూచి

సూత్రధారణ పూర్తి అయ్యింది. మంగళ వాయిద్యాలు మ్రోగాయి.

అక్షింతలు వేసి 'ఐశ్వర్య ఆరోగ్యప్రాప్తిరస్తు. పుత్రపౌత్రాభివృద్ధిరస్తు' అంటూ ఆ కొత్తజంటని మనస్సులోనే ఆశీర్వదించాడు అనంతం.

గుండెలమీంచి పెద్దకుంపటి దింపుకున్నట్టు అనుభూతి చెందాడు. పందిట్లో ఓ పక్కగా వున్న కుర్చీలో తృప్తిగా నిట్టూరుస్తూ కూర్చున్నాడు.

"గాలిలో తేలిపోతున్నావేంటి అనంతం. బాధ్యతలన్నీ నెరవేర్చావనా?" ఓ బంధువడిగాడు.

"పిల్లలకోదారిచూపడం కన్నవాళ్ళ బాధ్యతేకదా. అబ్బాయిలిద్దరూ ఏవో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇదిగో ఇంతక్రితమే అల్లుడి కాళ్ళు కడిగేశాను. ఇంక నాకంతా నిశ్చింతే కదా."

"అది నువ్వనుకున్నంత తేలికేమీకాదు. నీ తనువెళ్ళాలికదా. ఇన్నాళ్ళూ ఆ ఉద్యోగం ఈ ఉద్యోగం అనకుండా చేసి రెక్కలు ముక్కలు చేసుకున్నావు. పిల్లల్ని ఒడ్డునపడేశావు. వాళ్ళూ నిన్ను ఒడ్డున పడెయ్యాలిగా" అన్నాడా బంధువు.

"వాళ్ళేపడేస్తారు. నేను మా అయ్యని చూళ్ళేదా"

"అది అభిమానాల కాలం! ఇది ఆస్తుల కాలం!"

"మా పిల్లలు వజ్రమాణిక్యాల్లే"

సానుభూతిగా చూసి ఊరుకుండిపోయాడా బంధువు.

మంటపంలో వధూవరులు తలంబ్రాలు పోసుకుంటున్నారు.

వారి దగ్గర్నుంచొచ్చి తీరుబడిగా కూర్చొనివున్న రామారావుని ఓ పక్కకు తీసుకెళ్ళి తన కడుపులోని అక్కసు కక్కేసిందతడి భార్య.

"చూస్తున్నారా మీ నాన్న చేస్తున్న దండుగమారి ఖర్చులూ. మూడురకాల కూరలతో భోజనాలు పెట్టాలా? పోనీ అంతటితో ఊరుకున్నారేమో చూడండి. పెళ్ళి కొచ్చిన ఆడంగులందరికీ రవికెల గుడ్డలు పెడతార్ట..." అంటూ నిష్టూరమాడింది.

"ష్...మెల్లగా మాట్లాడవే ఎవరైనావింటారూ.."

"ఎవరో వింటారని నోర్మూసుకుంటే మీరూ మీ నాన్నాకలిసి నా పిల్లలనోట్లో ఇంత మన్ను పోస్తారు...!"

"అవేం మాటలే..."

"నేను గనుక ఇంత మర్యాదగా మాట్లాడుతున్నాను. ఎక్కడబడితే అక్కడ అప్పులు చేసి గొప్పలకి పోతున్నారని ఏకంగా తిట్టిపోస్తోంది మీ మరదలు."

"ఏంటన్నయ్యా" అంటూ అక్కడికి వచ్చాడు రామారావు తమ్ముడు లక్ష్మణ్.

భార్య జారుకోగా రామారావు మెల్లగా అన్నాడు "నాన్న పద్దతేం బాగోలేదురా. వెనకా ముందూ ఏమాత్రం చూడకుండా ఖర్చుపెట్టేస్తున్నాడు."

"నేను టీ.వీ. కొనుక్కుంటాను డబ్బు సర్దమంటే సర్దలేదు. ఇప్పుడు చూడు చెల్లి పెళ్ళికెంత ఖర్చు పెట్టాడో" నిష్ఠూరమాడాడు తమ్ముడు.

"గంతకి తగ్గ బొంతని చూడక తగుదునమ్మా అని పెద్ద సంబంధానికెళ్ళాడు. తలకు మించిన కట్నం గుమ్మరించాడు!" ఇద్దరూ మాట్లాడుకుంటూ తండ్రి కూర్చున్న వైపెళ్ళారు. వారి మాటలు విన్న అనంతం తుళ్ళిపడ్డాడు. కలవరపడ్డాడు.

"ఒరే ఏంట్రా..."

"ఏం లేదు నాన్నా... ఏదో మంచీచెడూ చెప్పుకుంటున్నామంతే..."

"నాకేం చెవుడులేదురా. మీ మాటలు విన్నానుగాని ఇలారండి. ఇదివరకే చెప్పేనుగా అమ్మాయిని ఒకింటికిచ్చామంటే మళ్ళీ వెనుదిరిగి చూడాల్సిన పరిస్థితుండకూడదు. అందుకనేరా కట్నంబరువెక్కువైనా అమ్ములికి మంచి సంబంధం చూసిచేశాను. ఇక దానిగురించి పట్టించుకోనక్కర్లేదు."

"ఇప్పుడే మొదలవుతుందసలు కథ. పెట్టుపోతలూ పురుళ్ళూ, పుణ్యాలూ! పుట్టింటిని పూర్తిగా దోచే దాకా నిద్రపోరు ఆడపిల్లలు" అన్నాడు రామారావు.

పెద్దకొడుకు మాటలకు నొచ్చుకున్నాడు. అనంతం

"అంతావేరు అమ్ములు వేరు. దానికి మా అమ్మ పేరు పెట్టాన్రా." అన్నాడు కించిత్తు గర్వంగా.

"పేర్లకి బుద్ధులు మారవు ఆడబడుచులకి దాహమూ తీరదు" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు చిన్నకొడుకు రుసరుసలాడుతూ.

కొడుకుల వంక చిత్రంగా చూసి నిట్టూర్చాడు.

అంపకాలు మొదలయ్యాయి.

అమ్మాయికే కాదు అనంతానికీ కన్నీళ్ళాగలేదు.

కనీపెంచి పెద్దచేసిన తన రక్తాన్ని మరొకరి కప్పగిస్తున్నాడు. ఈ ఇంటినీ ఇంటిపేరునీ మరచిపోయి మరో ఇంట మరో ఇంటిపేరుతో బ్రతకమని పంపిస్తున్నాడు. పుట్టింటితో బంధాన్ని తెంచుకుని అత్తింటితో అనుబంధాన్ని, ఆత్మీయతని పెంచుకోమని మరో ఇంట దీపం పెట్టి ఆ ఇంటికే మహాలక్ష్మివి కావాలని అంపకాలు పెడుతున్నాడు.

"ఏం చెప్పాలో తెలీటంలేదు తల్లీ. మీ అమ్మ వుండివుంటే ఎన్నో చెప్పేది. నాకేవీ తోచడంలేదు. తెలివైందానివి. నీకు చెప్పాల్సిన పనేవీలేదు. ఈ క్షణం నుంచి ఆ ఇల్లే నీ ఇల్లు. వారి బాగే నీబాగు. వాళ్ళ తలలో నాలికలా మసలి పుట్టింటికీ మెట్టినింటికీ పేరు తే తల్లీ" అన్నాడు అనంతం.

"నాన్నా!" అంటూ తండ్రి ఎదమీదవాలి బావురుమంది అమ్ములు.

"పెళ్ళయ్యేదాకానే నాన్న. ఆ తర్వాత నీ చేయి పట్టుకుని నడిపించేది నీ ఆలనాపాలనా చూసేదీ అల్లుడుగారేనమ్మా" అంటూ ఆమె చేతిని అల్లుడి చేతిలోపెట్టి "అల్లుడుగారూ! మా అమ్మాయి పసిపిల్ల. ఏమయినా తప్పొప్పులుంటే పెద్ద మనస్సుతో అర్థంచేసుకో నాయనా" అన్నాడు అనంతం.

వాళ్ళెక్కిన కారు కదిలిపోయింది.

మర్నాడు బంధువులెళ్ళిపోయారు.

మరి నాల్రోజులకి కొడుకులూ, కోడళ్ళూ పెట్టెలు సర్దుకున్నారు.

నెల తిరక్కుండానే అమ్మాయిని చీరసారెల్తో కాపురానికి పంపించారు.

ఒంటరిగా మిగిలిపోయాడు అనంతం.

పెళ్ళికి చేసిన అప్పులు లెక్కవేసుకునేసరికి గుండెలు గుభేలుమన్నాయి. తను తీర్చగలడా అన్న సందేహం కలగ్గా డీలాపడిపోయాడు.

అంతలోనే కూతురిని చక్కని ఇంట్లో దేనికీ లోటుండని ఇంట్లో వేసిన సంగతి గుర్తొచ్చి నిట్టూర్చాడు. కష్టాలు తనవెంటే పుట్టుకొచ్చాయి. జీవితంలో నిలదొక్కుకోడానికి కుటుంబాన్ని పోషించడానికి బ్రతుకు పొడవునా కష్టాలేవడ్డాడు. అవింకా కొనసాగబోతున్నాయి. తను కష్టాలుపడ్డా ఫర్లేదు కానవి పిల్లల్ని మాత్రం తాకకూడదు.

మళ్ళీ రొటీన్లో పడిపోయాడు అనంతం. కంపెనీలో ఉద్యోగం, షాపుల్లో ఎకౌంట్లు రాయడం. చిల్లరమల్లర పనులు చెయ్యడం కూతురు పెళ్ళికి చేసిన అప్పులు తీర్చడమే ఆయన లక్ష్యం.

***

తొలిపండక్కి వచ్చారు కూతురూ అల్లుడూ.

వస్తూనే అనంతానికిష్టమైనా జిలేజీ, సమోసాలు తెచ్చిపెట్టింది అమ్ములు. వద్దన్నా వినకుండా తనే మాంసం కొని తెచ్చి పకోడీలు వేసి తినిపించింది.

పండుగరోజున వాళ్ళకి అనంతం కొత్తబట్టలు పెడితే తను ఇక్కడికి వస్తూ తెచ్చిన రెడీమేడ్ దుస్తులు తండ్రిచేత ధరింపజేసింది కూతురు..

కొడుకు చేయనివి కూతురు చేస్తోంది.

"ఇవన్నీ నాకెందుకు తల్లీ. నువ్వు బాగుంటే అదే పదివేలు..." అన్నాడు అనంతం.

"నన్నక్కడ కంటికిరెప్పలా చూసుకుంటున్నారు నాన్నా...నిన్ను చూసేందుకెవరున్నారు చెప్పు?"

కుతుర్ని అత్తింట మహారాణిలా చూస్తున్నారన్న సంగతివిని పరమానందపడి పోయాడు అనంతం. అడిగినవాళ్ళకీ అడగనివాళ్ళకీ పనిగట్టుకుని మరీ చెప్పాడు. కూతురుకి తనంటే ఎంత అభిమానమో చెప్పి మురిసిపోయాడాయన.

"నీ వెర్రిగానీ లోకంలో మంచి కూతురూ తెల్లకాకులూ ఉండవు. పెద్దటెండరేదో పెట్టడానికి వేస్తున్న వేషాలవన్నీ" అన్నాడో మిత్రుడు.

అనంతానికా మాటలు రుచించలేదు. మిగతా వాళ్ళసంగతి వేరుగాని అమ్ములు మాత్రం అలాంటిది కాదనుకున్నాడు. అల్లుడికి పండగ బహుమానం ఇవ్వబోతే పుచ్చుకోలేదతడు.

"ఇన్నాళ్ళూ నువ్వు చేసింది చాలు. ఇంకా ఋణపడమంటావేంటి నాన్నా" అనేసింది కూతురు.

"మా అమ్మలా మాట్లాడుతున్నావే అమ్ములూ"

"మీ అమ్మనేకదా" కిలకిలా నవ్వేసింది.

అల్లుడి మంచితనం గురించి కొడుకులకి ఉత్తరం రాశాడు అనంతం. వీలు చేసుకుని వాళ్ళిద్దరిళ్ళకీ కూడా వెళ్ళమన్నాననీ త్వరలో వస్తారనీ పేర్కొన్నాడు.

"పండుగ పేరుజెప్పి ఎంతో దోచి పెట్టేరని మనం అనుకుంటామని నంగనాచిలా రాశాడు చూడండి మీ నాన్న. మనం జాగ్రత్తపడకపోతే అప్పులే మిగులుస్తారు" భర్తతో అంది పెద్దకోడలు.

"ఊరికే వచ్చిపడే డబ్బుకి ఆశపడని వాళ్ళెవరుంటారూ. ఇదంతా నాటకంలే. పండక్కి ఏమీ పుచ్చుకోలేదని ప్రత్యేకంగా రాశారూ అంటే ఎంతో పుచ్చుకున్నారని అర్థం.

చెల్లెలు వస్తానందిటగా. రానీ... అప్పుడే తెలుస్తుంది. అసలు రంగేంటో" అన్నాడు చిన్నకొడుకు భార్యతో.

* * *

అమ్ములు అన్నల ఇళ్ళకి వెళ్తున్నాని అనంతానికి ఫోన్‌చేసి ఎంతో ఉత్సాహంగా చెప్పింది.

కాని తిరిగి వచ్చేక చెయ్యలేదు. అక్కడ కొత్త దంపతుల్ని సరిగ్గా ఆదరించారో లేదోనని తల్లడిల్లిపోతున్నాడు అనంతం. ఫోన్‌చేసి కనుక్కుందామనోసారి ప్రయత్నించాడు గాని ఆమె పక్కనెవరైనావుంటే సంభాషణ వింటే బావుండదని పూరుకుండిపోయాడు.

వంటపూర్తిచేసి ఆఫీసుకెళ్ళడానికి తయారవుతోంటే అమ్ములొచ్చింది. ఎంతో బెంగగా గుండెల్లో దిగులుని దాచుకున్నదానిలా వుంది.

"అలావున్నావేం తల్లీ... అక్కడంతా క్షేమమే కదా?" ఆదుర్దా పడ్డాడు అనంతం

తలూపింది గాని గొంతు పెగల్లేదు. కన్నీళ్ళు పొంగివచ్చాయి. "ఏమయ్యిందమ్మా నీ బాధేమిటో నాకు చెప్పవూ"

కాస్సేపు బ్రతిమాలాక కళ్ళు తుడుచుకుంటూ అంది. "మా తోడికోడల్తో పోల్చి మా అత్తగారు నన్ను చిన్నచూపు చూస్తోంది నాన్నా."

"తనకన్నా నువ్వే ఎక్కువ కట్నం తీసుకెళ్ళేవుగా"

"బంగారం తనకెక్కువవుంది. గాజుల్ని గొప్పగా అందరికీ చూపిస్తూ నన్ను చిన్నబుచ్చుతోంది..."

అవాక్కయ్యాడు అనంతం. ఏమనాలో తోచలేదు. గాజులంటే మాటలుకాదు. ఎంతహీనంగా లెక్కేసినా పదివేలవుతాయి.

"పెడతానన్న బంగారమంతా పెట్టేశాం గదా. నీ తోడికోడల్తో పోలిస్తే ఎలాచెప్పు. కట్నం నువ్వెక్కువ తెచ్చేనని చెప్పకపోయావా.." అన్నాడు.

"అదీ అన్నాను.. మావగారూ సపోర్టు చేశారు. ఆవిడ గొణుగుడు తగ్గలేదు. తోడికోడలు ముందు తలెత్తుకోలేకపోతున్నాను.." అందామె.

"ఊరుకోమరి... నా పరిస్థితి నీకు తెలుసుకదా తల్లీ. అసలే అప్పుల్తో ఊపిరాడటంలేదు..."

"ఎప్పుడూ అది కావాలి ఇది కావాలి అని అన్నయ్యలు అడగటమేగాని నేనెప్పుడైనా నోరుతెరిచి అడిగానా నాన్నా? అడక్క అడక్క అడుగుతున్నాను. గాజులు చేయించవా నాన్నా?" కూతురు బేలగా అడుగుతుంటే కళ్ళు వాల్చేసుకున్నాడు అనంతం.

ఆమె చెప్పింది అక్షరసత్యం. 'ఎన్నడూ ఏమీ కోరలేదు. తనని అర్థం చేసుకుని మసలింది అమ్ములొక్కతే. కొడుకులామెని నాన్నకూచి అంటూ వెక్కిరించే వారు కూడా. కింకర్తవ్యం?

"తలతాకట్టు పెట్టి అయినా ఎలావోలా డబ్బు తెచ్చిస్తాన్లే..."

మర్నాడు డబ్బు తీసుకుని తండ్రిని పొగిడేసిమరీ అత్తింటికి వెళ్ళింది అమ్ములు. ఎక్కడ్నుంచి తెచ్చేవంటూ ఒక్కముక్క అడగనందుకు అసంతృప్తిగా ఫీలయ్యాడు అనంతం.

విషయం కొడుకులకి చెప్పేసరికి చెల్లెల్ని నానా తిట్లు తిట్టి ఇంకెప్పుడూ దానికి పైసా విదపొద్దని హుకుం జారీచేశారు కొడుకులు.

నెల తిరక్కుండా మళ్ళీ వచ్చింది అమ్ములు. అది కూడా ఒకటో తారీఖున. బీదమొహం పెట్టుకుని వట్టిచేతుల్తో రాగానే అర్థమైపోయింది అనంతానికి. ఆమె తన కూతురు కాదు మరో ఇంటి బాగుకోరే కోడలనుకోకుండా వుండలేకపోయాడు.

"ఇంటి మరమ్మత్తులకోసం బ్యాంకులో డబ్బు అప్పు తీసుకుంటున్నాం నాన్నా. సాక్షి సంతకాలు చెయ్యవా" అంది బ్యాగ్గులోంచి పేపర్లు తీస్తూ.

"అంతోటిపనికి ఇంతదూరం రావాలా నువ్వు" కించిత్తు అనుమానిస్తూనే అన్నాడు.

"ఈ విషయం నలుగురికీ తెలీడం మీ అల్లుడిగారికిష్టంలేదు నాన్నా..." అందామె.

"కరెంటులేదు కదా రేప్పొద్దుటే పెడతాన్లే..."

"చీకటితోనే వెళ్ళిపోతాను...అయినా నామీద నమ్మకం లేదా నాన్నా?" మారు మాట్లాడకుండా చూపించినచోటల్లా సంతకాలు పెట్టేశాడు.

మర్నాడు వెళ్ళేముందు ఒంట్లో బాగోటంలేదనీ ఖరీదైన మందులు వాడమన్నారనీ చెప్పి వెయ్యిరూపాయలు పట్టుకుపోయింది అమ్ములు.

తీసుకెళ్ళిన డబ్బుగురించికన్నా ఆమె పెట్టించుకున్న సంతకాల గురించే ఎక్కువ పీకులాటపడ్డాడు అనంతం.

వేటిమీద ఎందుకు పెడుతున్నావో చూసుకోకుండా ఎలా పెట్టావని సహోద్యోగి మందలించే సరికి "నా కూతురు నన్ను మోసంచెయ్యదులే" అని తనకితాను సర్దిచెప్పు కున్నాడు.

* * *

అప్పులవాళ్ళ ఒత్తిడి ఎక్కువయ్యింది. ఇల్లు అమ్మి ఋణవిముక్తుడవటమే మంచిదను కున్నాడు అనంతం. అనారోగ్యంగా వున్నప్పుడు కూడా తొంగిచూడని కొడుకులు సంగతి వినగానే రెక్కలు కట్టుకునొచ్చారు.

అప్పు కేన్సర్‌లాంటిదంటూ తీర్చెయ్యడమే మంచిదన్నారు. మిగతా సొమ్ముని తెలివిగా ఇన్వెస్టు చేసి సంవత్సరం తిరిగేసరికల్లా రెట్టింపు చేసుకుంటామన్నారు కొడుకులు.

"మీనాన్నదసలే ప్రైవేటు ఉద్యోగం. ఇల్లు అమ్మేస్తే ఆయన రేపెక్కడ వుంటాడూ ఎలా బతుకుతాడూ" అన్నాడు అనంతం మిత్రుడు.

"మేం లేమా అంకుల్. నాన్నని కంటికి రెప్పలా చూసుకోమూ" అన్నారు కోరస్‌గా.

దగ్గరుండి ఇల్లు అమ్మేశారు. విషయం ఎలా తెలిసిందోగాని భర్తతోసహా వచ్చి వాలింది అమ్ములు.

అనంతంతో సహా అందరూ అనుమానంగా చూశారు. అప్పులకిపోను మిగిలిన సొమ్ములో తనకీ వాటా ఇవ్వాలని కూర్చుంది అమ్ములు. ఎందరు నచ్చచెప్పినా వినలేదు. అన్నలు కొట్టడానిక్కూడా సిద్ధపడేసరికి లబలబలాడాడు అనంతం.

ముగ్గురికీ రాజీ కుదిర్చారు. ఇల్లు రిజిస్ట్రేషన్ చేసి తమతమ భాగం తీసుకుని ఎగిరిపోయారు ముగ్గురూ.

వెళ్తూ వెళ్తూ "ఒంటరివాడివికదా. ఎక్కడైనా ఒక గది తీసుకునుండు. అయిదా రొందల్లో దొరుకుద్ది." అని సలహా ఇచ్చారు కొడుకులు.

"వాళ్ళు పిల్లలు కాదురా రాబందులు. బ్రతికుండగానే నిర్దాక్షిణంగా చీల్చుకు తినేస్తున్నారు" వాపోయాడు మిత్రుల దగ్గర అనంతం.

"అమ్ములు వాళ్ళనిమించిపోతుందని కలలో కూడా అనుకోలేదురా. పెళ్ళయ్యాక పూర్తిగా మారిపోయింది. ఎన్నిసార్లు ఎన్నిరకాలుగా ఎంతపట్టుకుపోయిందో లెక్కలేదు" బాధపడ్డాడు.

"క్రితం జన్మలో ఋణపడివుంటావు. ఈ రూపేణ వసూలు చేసుకుంద"ని ఊరడించారు వాళ్ళు.

* * *

ఆకస్మాత్తుగా అనంతం ఆరోగ్యం దిగజారింది.

దగ్గు ఆయాసం అధికమయ్యాయి. ఊపిరితిత్తుల్లో నీరు చేరిందన్నారు.

రూపాయల మూట కావాలని అర్థమైపోయింది అనంతానికి. నాటుమందులు పన్జేయలేదు. పదిరోజులు వెళ్ళకపోయేసరికి పదకొండోరోజున ఉద్యోగమూ ఊడి పోయింది.

గత్యంతరంలేక కొడుకులకి ఫోన్‌చేశాడు. మూడోసారి ఫోన్ అందుకున్నాక వచ్చారు వాళ్ళు.

"మాదసలే సింగిల్‌రూం పోర్షన్. నాదగ్గరకి నిన్ను తీసుకెళ్ళలేను" అన్నాడు పెద్దకొడుకు.

"సిటీలో నువ్వుండలేవు నాన్నా. ఇక్కడుండటమే బెటర్" అన్నాడు చిన్నకొడుకు.

కొడుకులిద్దరూ ఎంతకీవైద్యం గురించి మాట్లాడకపోయేసరికి "పెద్దాస్పత్రిలో చేరాలంటున్నార్రా" అతికష్టంమీద అన్నాడు అనంతం.

"ఆసుపత్రులు డబ్బు గుంజుకోడానిగ్గాని రోగం నయం చెయ్యడానిక్కాదు. దగ్గరదగ్గర అరవై ఏళ్ళొస్తోంటే మందులేం పన్జేస్తాయి" అన్నాడు చిన్న కొడుకు. బలపరిచాడు పెద్దకొడుకు.

నెల నెలా అంతో ఇంతో పంపిస్తామని చెప్పి హడావిడిగా వెళ్ళిపోయారు.

కళ్ళ నీళ్ళు కుక్కుకుని శూన్యంలోకి చూస్తుండిపోయాడు అనంతం.

కొడుకులు వెళ్ళగానే కూతురొచ్చింది. కూతురుని చూసిన అనంతం గుండెల్లో రాయిపడింది.

"అయ్యో నాన్నా... ఎలాటివాడివి ఎలా అయిపోయావు..."అంటూ కన్నీళ్ళు పెట్టేసుకుంది.

"చూడమ్మాయ్... కన్నీళ్ళకి కరిగిపోయేస్థితిలో నేనిప్పుడు లేను. నా దగ్గర ఈడ్చితన్నినా చిల్లుకానీలేదు. సెంటు భూమిలేదు. ఇంక వెళ్ళిపో... కొడుకుల్ని నమ్ముకునే కన్నా కొబ్బరిచెట్టుని నమ్ముకోవడం మంచిదని పెద్దలెందుకన్నారో ఇప్పుడే తెలిసింది... దానికే కృంగిపోతున్నాను. నన్నింకా గాయపర్చకు..."

"అదికాదు నాన్నా..." బాధగా అందామె.

"నీకో నమస్కారం తల్లీ... పీక్కు తినడానికి ప్రాణాలు తప్ప నాదగ్గరేం లేవు. వెళ్ళిపో..." చేతులు జోడించాడు అనంతం. ఏడుస్తూ వెళ్ళిపోయింది అమ్ములు.

మూడోరోజున పోస్టులో ఓ బరువైన కవరొచ్చింది అనంతానికి. దానిలోవున్న బాండ్లనీ వివిధ పేపర్లనీ చూసి ఆశ్చర్యపోయాడు. వాటితో జతపరిచిన ఉత్తరాన్ని బయటికి తీశాడు.

"నాన్నా! నామీద నీకు పీకలదాకా కోపం వుందని తెలుసు. దయచేసి ఈ ఉత్తరం సాంతం చదువు.

నీ గురించి నీకన్నా నాకెక్కువ తెలుసునాన్నా. మాకోసం మా ఆనందంకోసం మా భవిష్యత్తు కోసం అనుక్షణం ఎంత తాపత్రయపడ్డావో నాకు తెలుసు. ఎన్ని చిరుద్యోగాలు చేశావో రెక్కల్నెలా ముక్కలు చేసుకున్నావో నాకు తెలీందికాదు.

అమ్మపోయాక అమ్మలేనిలోటు తెలీకుండా మాకేలోటూ రాకూడదని ఎంతగా తపనపడ్డావో తెలుసు. స్వయంగా చేతులు కాల్చుకుని వండివార్చి మాకు తినిపించిన చేతుల్ని ఎలా మరచిపోతాను నాన్నా? నీకు జిలేబీ ఇష్టం. సమోసాలు ఇష్టం. వేడి వేడి కాఫీత్రాగుతూ పేపర్ చదవటం ఇష్టం.

అవన్నీ చిన్న చిన్న కోరికలే. అయినా వాటిని తీర్చుకోకుండా ఆ సొమ్ముని మాకోసం వినియోగించేవాడివి. దారిలో దాహం వేస్తే సోడా తాగితే పావలా ఖర్చవుతుందని ఒగురుస్తూనే ఇంటికొచ్చి మంచి నీళ్ళు తాగే నిన్నెలా మర్చిపోతాను నాన్నా?

మమ్మల్ని పెంచి పెద్దచెయ్యడం ఒక బాధ్యతగా ఒక యజ్ఞంగా భావించి చేశావు. అందుకోసం నిన్ను నువ్వు సమిధని చేసుకున్నావు.

హేట్సాఫ్ నాన్నా. నేను సుఖపడాలని శక్తికి మించి కట్నం ఇచ్చి చక్కని సంబంధం చేశావు. నేను అత్తవారింట ఇవాళెంతో ఆనందంగా వున్నానంటే దానికి ఏకైకకారణం నువ్వే నాన్నా. నిన్ను ఏ పూలతో పూజించినా నీ ఋణం తీరదు నాన్నా.

నిన్ను పీడించి డబ్బుపట్టుకెళ్ళిన అమ్ములు ఇలా రాస్తోందేమిటని ఆశ్చర్యపోతున్నావు కదూ?

నేను మారాను నిజమే. అందుకోకారణం వుంది నాన్నా. పెళ్ళయిన కొత్తలో అన్నయ్యల ఇళ్ళకెళ్ళాం గుర్తుందా నాన్నా. అప్పుడు నాకో సత్యం తెలిసింది. నేను నాన్నకూచిని గనుక నీ సంపాదనంతా నాకు దోచిపెట్టేస్తావనీ, ఇల్లు నాకు రాసిచ్చేస్తావనీ అన్నయ్యలు అనుకోవడం విన్నాను. ఎలాగైనా ఇల్లు అమ్మి పంచుకోవాలనుకోవటమూ విన్నాను.

వాళ్ళింత స్వార్థపరులవుతారనుకోలేదేమో వారి ప్రవర్తనకి షాక్ తిన్నాను. పరిగ్గా అప్పుడే మా పక్కింటాయన కొడుకులూ కూతుళ్ళూ వుండికూడా ఎవరూ చూసేవాళ్ళులేక అనాథలా చనిపోయాడు.

అలాంటిస్థితి నీకు రాకూడదని రాత్రీపగలూ ఏడ్చాను నాన్నా. కొన్నాళ్ళుపోయాక నేనూ అన్నయ్యల్లా మారిపోతానేమో? నా భర్తో పిల్లలో నీకు సాయపడ్డానికి అడ్డంపడతారేమో? నా ఆర్థికపరిస్థితుల దృష్ట్యా నేన్నీకు చేతికర్రనవ్వలేనేమో?

ఏమో ఏమైనా జరగొచ్చుకదా.

అందుకనే అలాంటి రిస్కులో నీ భవిష్యత్తుని పడెయ్యకూడదని చెప్పి నా మనస్సు రాయిచేసుకున్నాను. మీ అల్లుడిగారి సలహాప్రకారం నీ దగ్గర గుంజిన డబ్బుని నీ పేరన పెన్షన్‌స్కీంలో జమచేశాను. నిన్ను చూడటానికొచ్చినప్పుడల్లా నీకు పండ్లూ అవీ కొని తీసుకెళ్ళమని మీ అల్లుడు ఇచ్చిన డబ్బుని కూడా అందులోనే దాచాను.

ఈ మధ్యనే నీ పేరుమీద మెడిక్లెయిమ్ పాలసీ కూడా తీసుకున్నాను. ఆ మధ్య నీ సంతకాలు తీసుకున్న కాగితాలన్నీ వీటి తాలూకువే.

నిజం చెబితే నువ్వు ఒప్పుకోవు. అన్నయ్యలు అంగీకరించరు. అందుకే ఇంత నాటకమాడాను నాన్నా. నీకు ఉద్యోగం లేకపోయినా అన్నయ్యలు డబ్బు పంపకపోయినా ఫర్లేదు నాన్నా నెలనెలా నీకు పెన్షనొస్తుంది. నీ వైద్య అవసరాల నిమిత్తం ఇన్సూరెన్స్ పాలసీ వుంది. మా నాన్న ఎవర్నీ దేబిరించకూడదు. ఎవరిమీదా ఆధారపడకూడదు.

మేం పక్షులం మాత్రమే. మా నాన్న మహావృక్షం.

వెంటనే ఆసుపత్రిలో చేరు నాన్నా...

ఇట్లు,

అమ్ములు"

ఉత్తరం చదువుతోంటే జలజల కన్నీళ్ళు కారిపోసాగాయి అనంతం కళ్ళనుంచి.

"అమ్మా!" అన్నాడు ఆర్తిగా.

ఆయన పిలిచింది జీవితాన్నిచ్చిన అమ్మని కాదు జీవనాన్నిచ్చిన అమ్మని.

(స్వాతి మాసపత్రిక)

**మే 2003**